



ప్రజా **రిపబ్లిక్**
ప్రతి అక్షరం ప్రజల కోసం




సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 228 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | సోమవారం 24 మార్చి 2025
RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalledudem, Kadapa, Ongole

# ఉల్లి రైతు కంట కన్నీరు

## మహారాష్ట్ర నుండి నాణమైన ఉల్లి దిగుమతి

మార్చి 24:( రిపబ్లిక్ న్యూస్): వ్యవసాయ మార్కెట్ యార్డ్ లలో ఉల్లి రైతులకు సరైన గిట్టు బాటు ధర రాకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు రేటు రాకపోవడంతో రైతు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. బ్యాంకులలో తీసుకున్న రుణాలు చాలకపోవడంతో ప్రైవేటు వడ్డీ గాళ్ల వద్ద అధిక వడ్డీలకు తీసుకొని ఉల్లి పంటలు సాగు చేశారు. ఉల్లి పంట దిగుబడి బాగానే వచ్చిన రేట్లు మాత్రం ఆశాజనకంగా లేవు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు మహారాష్ట్ర నుండి నాణ్యమైన ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. ఎంతో జిల్లా రైతులకు సరైన ధరలు రావడం లేదు. మహారాష్ట్ర ఉల్లి నాణ్యత ఎక్కువగా ఉండడంతో వ్యాపారస్తులు మహారాష్ట్ర నుండి దిగుమతి అయిన ఉల్లినే కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మార్కెట్ యార్డులల్లో ఉల్లికి సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. పడిపోతున్న ఉల్లి ధరల కారణంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీగా నష్టపోతున్నామని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పడిపోతున్న ఉల్లి ధరలు

## బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్‌కు ఆగిన ఎగుమతులు



### మహారాష్ట్ర నుండి నాణ్యమైన ఉల్లి దిగుమతి

ఉమ్మడి కర్నూలు జిల్లాకు మహారాష్ట్ర నుండి నాణ్యమైన ఉల్లి ఎక్కువ దిగుమతి చేసుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో రైతులు ఉల్లి పంటను ఎక్కువ సాగు చేశారు. ఒకప్పుడు జిల్లా రైతులు పండించిన ఉల్లి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ కు కూడా పంపించేవారు. ప్రస్తుతం ఉల్లిధర భారీగా పడిపోవడంతో రైతులు దిక్కులు తోచని స్థితిలో కొట్టు మీట్టాడుతున్నారు. ఉల్లి కి సరి అయిన ధర రాకపోవడానికి ప్రధాన కారణం మహారాష్ట్ర నుండి ఎక్కువ సంఖ్యలో ఉల్లి కర్నూలు వ్యవసాయ మార్కెట్ కు వస్తుంది.



మహారాష్ట్ర ఉల్లి ఎక్కువ నాణ్యత ఉంటుంది. వినియోగదారులతో పాటు వ్యాపారస్తులు కూడా ఈ ఉల్లిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు.


### పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆగిన ఉల్లి ఎగుమతులు




కర్నూలు రైతులు పండించిన ఉల్లి పంటను ఏకంగా పశ్చిమ బెంగాల్ బంగ్లాదేశ్ కు ఎక్కువ స్థాయిలో సరఫరా చేసేవారు. అక్కడ ధరలు కూడా బాగా వస్తున్న కారణంగా ఎగమతికి కొంత డబ్బు ఖర్చు అయినప్పటికీ రైతులు అక్కడికే తమ పండించిన పంటలను అక్కడే ఉల్లిని ఎగు మతి చేసేవారు. పెట్టిన పెట్టుబడి పోగా రైతులు ఆలోచించిన రీతిలోనే ఆదాయం బాగా వచ్చేది. రైతుల ఇంట్లో సిరుల పంటలు కురిసేవి. రైతులు ఏ కష్టం లేకుండా సంతోషంగా ఉండేవాడు. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లి ధర బాగా పడిపోయింది. దీంతో దిక్కుతున్న పరిస్థితిలో రైతులు కొట్టు మిట్టాడు తున్నారు. ప్రస్తుతం అక్కడ కూడా ధరలు ఆశ జనంగా లేకపోవడంతో తమ ఉల్లి పంటలను ఇక్కడే విక్రఇస్తున్నారు.

### ఉల్లి రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది

నిన్నమొన్నటి వరకు రైతన్నలను కాస్త ఆదుకున్న ఉల్లి నేడు కన్నీరు పెట్టిస్తోంది. అన్ని వ్యవసాయ ఉత్పత్తుల బాటలోనే రోజురోజుకూ ఉల్లి ధర పతనం అవుతోంది. అమాంతం పడిపోయిన ఉల్లి రేట్లతో భారీగా నష్టపోతున్నామని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ లో గత కొంతకాలంగా మిర్చి, కంది, వాము, వేరుశెనగ తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉల్లి పంటకు మొన్నటి వరకు స్థిరంగా గిట్టుబాటు ధర లభించింది. ఇదే ధరలు కొనసాగుతాయని ఆశించిన రైతుకు తీవ్ర నిరాశే ఎదురైంది. గత వారం రోజుల నుంచి ధరల పతనం ప్రారంభమైంది. ప్రస్తుతం సగానికి పైగా ధరలు పడిపోవటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కర్నూలు మార్కెట్‌కు రోజూ 700 నుంచి 1000 క్వింటాళ్ల ఉల్లి



దిగుబడులు వస్తున్నాయి. క్వింటా ధర అత్యధికంగా 14 వందలు, కనిష్ఠ ధర రూ. 300 నుంచి రూ. 500 వరకు పలుకుతోంది. దీంతో కనీసం పెట్టుబడులు సైతం రావటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.కర్నూలు జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉల్లి దిగుబడులు త్వరగా పాడవుతున్నాయి. మరోవైపు డిమాండ్ లేక పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లకు ఎగుమతులు దాదాపు ఆగిపోయాయి. మహారాష్ట్ర నుంచి నాణ్యమైన ఉల్లిగడ్డలు అధికంగా వస్తుండటంతో వాటితో కర్నూలు ఉల్లి పోటీపడలేకపోతోంది. ఫలితంగా ఉల్లి ధరలు పడిపోతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ధరల పతనం ఇదే విధంగా కొనసాగితే సాగు చేసే పరిస్థితి ఉండదంటున్న రైతులు ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



### ఎగుమతి సుంకం రద్దు, తగ్గనున్న ఉల్లి ధరలు

సామాన్య ప్రజలకు గుడ్ న్యూస్ వచ్చేసింది. ఎగుమతి సుంకం ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం తో ఉల్లి ధర మరింత తగ్గే ఈ క్రమంలో మరికొన్ని రోజుల్లో ఉల్లి రేట్లు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. అయితే రైతులకు మాత్రం సరైన ధరలు వచ్చే అవకాశం లేదు. ఉల్లి ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1 2025 నుంచి ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించారు. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని "సున్నా"కి తగ్గించడంతో ధరలు మరింత తగ్గుతాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.



### సుంకం తగ్గితే రైతులకు ఊరట

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, రైతుల పట్ల సానుకూల దృక్కోణాన్ని ప్రతిబింబిస్తుంది. రైతులకు కొంత లాభదాయకమైన ధరలతోపాటు, వినియోగదారులకు కూడా ఉల్లి రేట్లు అదుపులో ఉంటాయి అని భావిస్తున్నారు. రబీ పంటలు బాగా పండిన క్రమంలో ఈ ధరలు మరింత తగ్గుతాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా రిటైల్ ధరలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రజలు ఎక్కువ ఉల్లిని కొనుగోలు చేసే అవకాశం ఉంది ఇది మార్కెట్లో సరైన సరఫరా గమనాన్ని నెలకొల్పి, ప్రతి స్థాయిలోనూ ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ నిర్ణయం దేశీయ, అంతర్జాతీయ ఉల్లి మార్కెట్‌లను ప్రభావితం చేస్తుంది. సరైన సరఫరా, ధరల నియంత్రణతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తుంది.



పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

---

ప్రతి కప్పును ఆస్వాదిస్తుంటే..

## వారి స్ఫూర్తిదాయక ప్రయాణం గుర్తుకురావాలి: చంద్రబాబు

అరకు కాఫీ గురించి మన్ కీ బాత్లో ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి, పార్లమెంట్లో కాఫీ స్టాల్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



అమరావతి, మార్చి 24, (రిపబ్లిక్ న్యూస్): అరకు కాఫీ గురించి మన్ కీ బాత్లో ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి, పార్లమెంట్లో కాఫీ స్టాల్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిన లోక్సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేసిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా చంద్రబాబు స్పందించారు. "ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణం. వారి అంకిత భావం, కృషి.. అరకు కాఫీని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రతి కప్పును ఆస్వాదిస్తుంటే.. వారి స్ఫూర్తిదాయక ప్రయాణం గుర్తుకురావాలి" అని అన్నారు. పార్లమెంట్లో మన అరకు కాఫీ స్టాళ్లను ప్రారంభించేందుకు ప్రోత్సహించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కృతజ్ఞతలు చెప్పారు.

## బీచ్ పర్యాటకానికి ఊతమిచ్చేలా ప్రభుత్వ చర్యలు: మంత్రి దుర్గేశ్

విశాఖ రుషికొండ బీచ్‌లో మంత్రి కందుల దుర్గేశ్ బ్లూఫ్లాగ్ ఎగురవేశారు.



విశాఖ, మార్చి 24, (రిపబ్లిక్ న్యూస్): విశాఖ రుషికొండ బీచ్ లో మంత్రి కందుల దుర్గేశ్ బ్లూఫ్లాగ్ ఎగురవేశారు. కొన్ని రోజుల క్రితం తాత్కాలికంగా బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ ను డెన్మార్క్ సంస్థ నిలిపేసింది. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దడంతో మళ్లీ బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ లభించింది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఫ్లాగ్ను జిల్లా కలెక్టర్కు సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణకు బ్లూ ఫ్లాగ్ తోడ్పడుతుందన్నారు. బీచ్ పరిశుభ్రతకు పర్యాటకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. రాష్ట్రంలో బీచ్ పర్యాటకానికి మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వ చర్యలు ఉంటాయన్నారు.

### గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో పోసాని హాజరు

వైకాపా నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళి గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు.

గుంటూరు, మార్చి 24, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళి గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబును దూషించిన కేసులో బెయిల్ మంజూరు చేసే క్రమంలో.. వారంలో రెండు రోజులు సీఐడీ కార్యాలయంలో పోసాని హాజరుకావాలని గుంటూరు న్యాయస్థానం షరతు విధించింది. అందులో భాగంగానే సోమవారం, గురువారం గుంటూరు సీఐడీ కార్యాలయంలో సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఐడీ కార్యాలయంలో పోసాని హాజరయ్యారు.



11,298 ఎకరాల్లో పంట నష్టం..

## ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక:తుమ్మల

వడగళ్ల వానలతో పంట నష్టంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. మార్చి 21 నుంచి 23 వరకు వడగళ్ల వానలతో పంట నష్టం సంభవించింది.

హైదరాబాద్, మార్చి 24, (రిపబ్లిక్ న్యూస్): ఈ ఏడాది మార్చి 21 నుంచి 23 వరకు వడగళ్ల వానలతో పంట నష్టం సంభవించింది. పంట నష్టంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. దీనికి సంబంధించి తుది నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశామని ఆయన తెలిపారు. 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందన్నారు. 309 ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి నివేదిక వచ్చాక పరిహారం చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు.



## బెట్టింగ్ యాప్ల కేసుల్లో కీలక పరిణామం

బెట్టింగ్ యాప్ల కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మియాపూర్లో నమోదైన కేసులో యాప్ల యజమానులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు.

హైదరాబాద్, మార్చి 24, (రిపబ్లిక్ న్యూస్):బెట్టింగ్ యాప్ల కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మియాపూర్లో నమోదైన కేసులో భాగంగా యాప్ల యజమానులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. ఈ లిస్టులో మెుత్తం 19 యాప్ల యజమానులున్నారు. జంగిల్ రమ్మీ డాట్ కామ్, ఏ 23, యోలో 247, ఫెయిర్ ప్లే, జీత్విన్, విబుక్, తాజ్ 77, వివి బుక్, ధనిబుక్ 365, మామ247, తెలుగు 365, ఎస్365, జై365, జెట్ఎక్స్, పరిమ్యాచ్, తాజ్777బుక్, ఆంధ్రా365 యాప్ల యజమానులను నిందితుల జాబితాలో చేర్చారు. ఈ మేరకు పోలీసులు వారికి నోటీసులు ఇచ్చి విచారించనున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు, ఇన్ఫ్లుయెన్సర్లు సహా 25 మందిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# నాక్కూడా కారు ఈఎంఐ ఉంది: పృథ్వీరాజ్ సుకుమారన్

పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురాన్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



'లూసిఫర్ 2: ఎంపురాన్' ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. సినిమా విశేషాలతోపాటు తన జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాలను ఆయన బయటపెట్టారు. ముఖ్యంగా తన తండ్రి సుకుమారన్ గురించి ఆయన మాట్లాడారు. తండ్రి నుంచి తాను ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నానని అన్నారు. ఆయన దర్శకత్వం చేయాలని ఎన్నో కలలు కన్నారని కాకపోతే అవి నెరవేరకుండానే కన్నుమూశారని చెప్పారు. అంతేకాకుండా, తన సక్సెస్ చూసేందుకు ఆయన పక్కన లేరని.. అది తనకు ఎంతో బాధగా ఉందని వెల్లడించారు. డబ్బు కోసమే ఏమైనా చిత్రాల్లో యాక్ట్ చేశారా? అని ప్రశ్నించగా.. "డబ్బు కోసమే సినిమాలు చేయలేదు. కానీ, వాణిజ్య ప్రకటనలు చేశా. రెండు గంటలపాటు షూట్లో పాల్గొంటే అధిక మొత్తంలో డబ్బు ఇచ్చేవారు. ఓకే చెప్పేవాడిని. నేను ప్రమోట్ చేసే ఉత్పత్తుల ఎంపికలోనూ జాగ్రత్త వహిస్తుంటా. ఆయా వస్తువులు, ఉత్పత్తులను నమ్మనప్పుడు.. వాటి జోలికి వెళ్లను. మరీ ముఖ్యంగా చెప్పాలంటే సమాజానికి ఎలాంటి హాని చేయని ఉత్పత్తులను మాత్రమే ప్రమోట్ చేస్తా" అని తెలిపారు. దర్శకత్వం అనేది ఆర్థికపరంగా తాను తీసుకున్న ఒక తెలివితక్కువ ఆలోచన అన్నట్లు ఆయన చెప్పారు. సుమారు రెండేళ్ల పాటు ఈ సినిమా కోసం కేటాయించానని.. ఈ సమయంలో ఎన్నో సినిమా అవకాశాలు పక్కనపెట్టానని తెలిపారు. ఆయా చిత్రాల్లో నటించి ఉంటే తనకు డబ్బు వచ్చేదని తెలిపారు. అందరి మాదరిగానే నటీనటులకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఉంటాయన్నారు. తనకూ కారు ఈఎంఐ ఉందని వెల్లడించారు. రజనీకాంత్‌తో సినిమా చేయాలని ఉందని పృథ్వీరాజ్ సుకుమారన్ తెలిపారు. "ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే ప్రతి దర్శకుడికి రజనీకాంత్ సినిమా చేయాలని ఉంటుంది. నాక్కూడా ఆ కోరిక ఉంది. ఆయన కోసం నా వద్ద ఒక ఐడియా ఉంది. స్క్రిప్ట్ ఇంకా సిద్ధం చేయలేదు. కథ సిద్ధం అయ్యాక దర్శకత్వం గురించి అప్పుడు ఆలోచిస్తా" అని చెప్పారు. మోహన్లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ రూపొందించిన చిత్రమే 'లూసిఫర్ 2: ఎంపురాన్'. 2019లో విడుదలైన 'లూసిఫర్‌కు కొనసాగింపుగా ఇది సిద్ధమైంది. యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ గా రానుంది. మార్చి 27న విడుదల కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'పుష్ప'లో ఐటమ్ సాంగ్ కోసం కేతిక శర్మను అనుకున్నాం: నిర్మాత రవి

నితిన్ తాజా చిత్రం 'రాబిన్ హుడ్. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లో నిర్మాత రవి ఓ ఆసక్తికర విషయం పంచుకున్నారు.





ప్రస్తుతం రాబిన్ హుడ్లో కేతికశర్మ పాట సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్లో మిలియన్ల వ్యూస్తో టాప్లో కొనసాగుతోంది. అయితే 'పుష్ప' సినిమాలో ఐటమ్ సాంగ్ కేతిక శర్మ చేయాల్సిందట. తాజాగా ఆ చిత్ర నిర్మాత ఈ విషయాన్ని పంచుకున్నారు. నితిన్ – వెంకీ కుడుముల కాంబోలో రానున్న చిత్రం 'రాబిన్ హుడ్'. మార్చి 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ ఓ ఆసక్తికర విషయం పంచుకున్నారు. "ఈ సినిమాను 'అది దా సర్ప్రైజ్ పాటతో కేతికశర్మ మరో స్థాయికి తీసుకెళ్లారు. 'పుష్ప'లో ఐటమ్ సాంగ్ కోసం సమంత కంటే ముందు కేతికను కలవాలనుకున్నాం. కానీ, అప్పుడు మిస్ అయ్యాం. మళ్లీ ఇన్నేళ్లకు ఆమెతో వర్క్ చేసే అవకాశం వచ్చింది. ఈ సినిమాలో ఆమె పాట ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. శ్రీలీల చాలా బిజీగా ఉండి కూడా తేదీలు సర్దుబాటు చేసుకొని ఇందులో నటించారు" అని చెప్పారు. రష్మిక అందుకే 'రాబిన్ హుడ్' చేయలేదు: దర్శకుడు ఇక ఈ సినిమాలో హీరోయిన్గా మొదట రష్మికను అనుకున్నట్లు దర్శకుడు వెంకీ కుడుముల తెలిపారు. అయితే, డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె ఈ సినిమాలో నటించలేకపోయిందన్నారు. కథ చెప్పగానే శ్రీలీల అంగీకరించారన్నారు. ఇది ఆమె కెరీర్లో గుర్తుండిపోయే సినిమా అవుతుందన్నారు. నితిన్ – వెంకీ కుడుముల కాంబోలో రానున్న రెండో చిత్రమిది. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేస్తుండడం విశేషం. ఇప్పటివరకూ విడుదలైన పాటలు ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి.


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1603 : బ్రిటిషు మహారాణి ఎలిజబెత్ మరణం (జ.1533).
- 1775 : భారత దేశానికి చెందిన కవి,రచయిత,వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితులు జననం (మ.1835)
- 1882 : క్షయ వ్యాధికి కారణమైన మైకోబాక్టీరియా ట్యూబర్క్యులాసిస్ ని రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- 1977 : భారత ప్రధానమంత్రిగా మొరార్జీ దేశాయ్ నియమితుడైనాడు. (చిత్రంలో)
- 1984 : భారత హాకీ క్రీడాకారుడు ఆడ్రియన్ డీసౌజా జననం.
- 1896 : చరిత్రలో మొదటి రేడియో ప్రసార సంకేతాలను ఎ.ఎస్.పోపోవ్ సృష్టించాడు.
- 1998 : భారత లోక్‌సభ స్పీకర్‌గా జి.యమ్.సి.బాలయోగి పదవిని స్వీకరించాడు.
- 1982 : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం


ఎలిజబెత్



ముత్తుస్వామి దీక్షితులు



రాబర్ట్ కోచ్


మొరార్జీ దేశాయ్


ఆడ్రియన్ డీసౌజా


ఎ.ఎస్.పోపోవ్


జి.యమ్.సి.బాలయోగి




క్షయవ్యాధి నివారణ దినోత్సవం

రిపబ్లిక్ స్పోర్ట్స్

# జోఫ్రా ఆర్చర్ ఖాతాలో చెత్త రికార్డు.. రేసిజం వివాదంలో హర్భజన్ సింగ్

రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్పై మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హర్భజన్ క్షమాపణలు చెప్పాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?



కొన్నేళ్ల విరామం తర్వాత ఐపీఎల్లో అడుగుపెట్టిన ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తొలి మ్యాచ్లోనే చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం సన్రైజర్స్ హైదరాబాద్ జరిగిన మ్యాచ్లో ఈ రాజస్థాన్ బౌలర్ భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. ఈక్రమంలో కామెంటేటర్గా వ్యవహరించిన టీమ్ ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ఆర్చర్‌ను 'కాలీ ట్యాక్సీ'తో పోల్చడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. 18వ ఓవర్ లో ఆర్చర్ వేసిన బౌలింగ్లో హైదరాబాద్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ వరుసగా బౌండరీలు బాదాడు. ఆ సమయంలో కామెంట్రీ చేస్తున్న భజ్జీ.. "లండన్లో కాలీ ట్యాక్సీల మీటర్ల మాదిరిగానే.. ఆర్చర్ మీటర్ ఈ రోజు పెరుగుతూనే ఉంది" అంటూ వ్యాఖ్యానించాడు. ఇదికాస్తా వివాదాస్పదంగా మారింది. అతడు జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడంటూ నెటిజన్లు ఆరోపిస్తున్నారు. కామెంట్రీ ప్యానెల్ నుంచి హర్భజన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై భజ్జీ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. తొలి మ్యాచ్లో హైదరాబాద్ చేతిలో రాజస్థాన్ ఓటమి చవిచూసింది. ఈ మ్యాచ్లో 4 ఓవర్లు వేసిన ఆర్చర్ ఏకంగా 76 పరుగులు ఇచ్చాడు. గతేడాది గుజరాత్ బౌలర్ మోహిత్ శర్మ (73) పేరిట ఉన్న రికార్డును దాటి.. ఓ ఐపీఎల్ మ్యాచ్లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్ గా మారాడు

## ఆరోగ్యం

# వేసవిలో 30 రోజుల పాటు మఖానా తింటే ఏమవుతుందో తెలుసా?

మఖానాలో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇది సులభంగా జీర్ణమవుతుంది. ఇది వేసవిలో శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి పనిచేస్తుంది. ఇది వేసవిలో కోల్పోయిన శక్తిని తక్షణమే అందించడంలో సాయపడుతుంది.

మార్చి నుంచే వేసవి కాలం ప్రారంభమైంది. ఈ సారి తీవ్రమైన ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. వేసవిలో శరీరాన్ని ఎనర్జీగా, చల్లగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ సీజన్‌లో శరీరం నీటిని ఎక్కువ కోల్పోతుంటుంది. దీంతో, చాలా మంది వేసవిలో జ్యూసులు తాగుతుంటారు. కొందరు పుచ్చకాయ, కర్బూజ కాయల్ని తింటుంటారు. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. అయితే, శరీరాన్ని చల్లబరిచే కొన్ని గింజలు కూడా ఉన్నాయి. మఖానా వాటిలో ఒకటి. మఖానా శరీరాన్ని చల్లబర్చడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. మఖానాలో పోషకాలు మెండుగా ఉంటాయి. ఇది సులభంగా జీర్ణమవుతుంది. ఇది వేసవిలో శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి పనిచేస్తుంది. ఇది వేసవిలో కోల్పోయిన శక్తిని తక్షణమే అందించడంలో సాయపడుతుంది. వేసవిలో ముప్పై రోజుల పాటు మఖానా తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

### మఖానాలో పోషకాలు మెండు



మఖానాను ఫాక్స్ నట్స్ లేదా లోటస్ సీడ్స్ అని పిలుస్తారు. ఇది ఒక పోషకమైన, తక్కువ కేలరీల చిరుతిండి. బరువు తగ్గడానికి ఇది బెస్ట్ ఆప్షన్. మఖానాలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ ఫైబర్, ప్రోటీన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతేకాకుండా మెగ్నీషియం, పొటాషియం వంటి అవసరమైన పోషకాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే దీన్ని సూపర్ ఫుడ్ అంటారు. దీన్ని స్నాక్ తినడం వల్ల బరువు నియంత్రణలో ఉండి శరీరం చల్లగా ఉంటుంది.




### మఖానా ప్రభావం ఏంటి?



- మఖానా స్వభావం – ఫూల్ మఖానా స్వభావం చల్లదనం. ఈ కారణంగానే ప్రజలు వేసవిలో మఖానాకు ప్రాధాన్యత ఇస్తారు. ఇది శరీరాన్ని లోపలి నుంచి చల్లగా ఉంచుతుంది.
- తక్కువ కేలరీలు – 100 గ్రాముల మఖానాలో దాదాపు 350 కేలరీలు ఉంటాయి. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారికి ఇది మంచి ఎంపిక.
- అధిక ఫైబర్ – మఖానాలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సాయపడుతుంది. మఖానా తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అదనపు కేలరీల తీసుకోవడం తగ్గుతుంది.
- ప్రోటీన్ అధికంగా ఉంటుంది – మఖానాలో మంచి మొత్తంలో ప్రోటీన్ కూడా ఉంటుంది. ఇది కండరాలను నిర్మించడంలో, జీవక్రియను పెంచడంలో సాయపడుతుంది.
- గ్లూటెన్-రహిత, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ – మఖానా గ్లూటెన్-రహిత, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

### నియంత్రణలో రక్తపోటు



రక్తపోటు ఎక్కువగా ఉన్నవారు రోజూ మఖానా తినవచ్చు. ఇందులో సోడియం తక్కువగా, పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఈ రెండూ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అధిక రక్తపోటుతో బాధపడేవారు మఖానా క్రమం తప్పకుండా తినాలి. మఖానా తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

### మలబద్ధకం నుంచి ఉపశమనం



మఖానాలో పుష్కలంగా ఫైబర్ లభిస్తుంది. ఇది గ్యాస్, అజీర్ణం వంటి సమస్యల నుంచి రిలీఫ్ అందిస్తుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో మఖానా సాయపడతాయి. జీర్ణసమస్యలతో బాధపడేవారికి ఇది బెస్ట్ ఆప్షన్. దీన్ని స్నాక్ ఐటమ్‌లా తీసుకోవచ్చు.

### బరువు తగ్గవచ్చు




బరువు తగ్గాలనుకునేవారికి మఖానా మెరుగైన ఎంపిక. ఎందుకంటే మఖానాలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి బాగా సాయపడతాయి. వీటిలో ఇథనాల్ అనే మూలకం ఉంటుంది. మఖానా తినడం ద్వారా ఊబకాయాన్ని నియంత్రించవచ్చు.

### గుండె ఆరోగ్యం మెరుగు



మఖానా తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. తామర గింజలలో ఆల్కలాయిడ్స్ వంటి అంశాలు కనిపిస్తాయి. ఇవి గుండె సంబంధిత ప్రమాదాలను నివారించడంలో సహాయపడతాయి. గుండె సమస్యలతో బాధపడేవారు మఖానా తింటే మంచిదంటున్నారు నిపుణులు.

### ఈ విషయాలు ముఖ్యం



- ఆరోగ్యానికి మేలు చేసేది ఏదైనా సరే మితంగా తినాలి. ఎక్కువగా తింటే అనారోగ్యానికి ముప్పు. పోషకాలు అందాలంటే మఖానాను మితంగా తినడం మేలు.
- అలెర్జీ సమస్యలతో బాధపడేవారు మఖానాను తినకపోవడమే మంచిది.
- మఖానా ఎక్కువగా తినడం వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. అందుకే తగిన మోతాదులో వీటిని తినండి.
- మఖానాను స్నాక్ ఐటమ్‌లా తినవచ్చు. కావాలంటే వేయించి వీటిని తినవచ్చు

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.